క్లుప్తంగా

నేడు సద్దిమూట ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్లో సద్దిమూట (రైతులకు రూ.5కే భోజనం) కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభిస్తున్నామని ఏఎంసీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ అన్నారు. రైతులకు రూ.5కే భోజనం ఏర్పాటు చేయనున్న ప్రాంగణాన్ని గురువారం ఏఎంసీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ సందర్శించి మాట్లాడారు. సమావేశంలో ఏఎంసీ సెక్రటరీ షంషీర్, సూపర్ వైజర్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభివృద్ధికి కృషి

తొర్రూరు: దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తామని సీడీపీఓ కమలాదేవి అన్నారు. డివిజన్ కేంద్రంలోని రైతువేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల ఎంపికపై సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. ఉపకరణాల అందజేతతో దివ్యాంగులు, వయోవృద్ధుల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ విజయలక్ష్మీ, సూపర్‌వైజర్లు శ్రీదేవి, మల్లీశ్వరీ, సునీత, నాగమణి, శోభ, విజయ పాల్గొన్నారు.

శునకాల దాడిలో 20 గొర్రెలు మృతి



బయ్యారం: గొర్రెల కొట్టంలోకి కుక్కలు చొరబడి, స్వైరవిహారం చేసి 20 గొర్రెలను చంపిన సంఘటన గురువారం తెల్లవారుజామున మండలంలోని జగ్గుతండా పంచాయతీలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జగ్గుతండాలోని నేతాజీనగర్‌కు చెందిన నసర్ల వీరన్న తన ఇంటి సమీపంలోని కొట్టంలోకి గొర్రెలను తోలి ఇనుప కంచెను అడ్డుపెట్టాడు. తెల్లవారుజామున కుక్కలు కంచెకు రంధ్రం చేసుకొని కొట్టంలోకి చొరబడి 20 గొర్రెలను చంపేశాయి. బాధితుడికి 2.50లక్షల నష్టం సంభవించింది.

గ్రామసభల పేరుతో కొత్త నాటకం

గూడూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గ్రామసభల పేరుతో కొత్త నాటకం ఆడుతుందని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. సర్వేల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, గ్రామ సభల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు చీదురు వెంకన్న, రహీంపాషా, కిషన్, ఎల్లయ్య పాల్గొన్నారు.

'నాయకులు చెప్పిన వారికే పథకాలు'

పెద్దవంగర: సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపడుతున్న గ్రామసభలతో రాష్ట్ర ప్రభుత్వం వంచిస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఐలయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల కనుసన్నల్లో గ్రామ సభలు జరుగుతున్నాయని, వారు చెప్పిన జాబితానే అధికారులు సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు కేతిరెడ్డి సోమనర్సింహ రెడ్డి, శ్రీరాం సంజయ్, కనుకుంట్ల సంజయ్, శ్రీరాం సుధీర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం శివారు వరంగల్–ఖమ్మం హైవేపై గోపతండా సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చలమల్ల రవికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దనాగారానికి చెందిన రవి బంక్‌లో పెట్రోల్ పోయించుకొని ఇంటికి వస్తుండగా కారు ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చుట్టుపక్కల వారు అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పోరాట వీరుడు సుభాష్ చంద్రబోస్

మహబూబాబాద్ అర్బన్/కేసముద్రం/దంతాలపల్లి/నెల్లికుదురు: స్వాతంత్య్ర సాధనలో అలుపెరగని పోరాటం చేసిన వీరుడు సుభాష్‌చంద్రబోస్ అని జిల్లా విద్యాశాఖ ఏఎంఓ మైద చంద్రశేఖర్‌ఆజాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీల్లో నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు టెన్నిస్ డోల్మా, రితేష్‌మౌర్య, సతీష్ చౌదరి, దుర్గాప్రసాద్, కాంత్రి, శ్రీలత పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..!

- రోడ్లపైనే పెంటకుప్పలు
- పట్టించుకోని అధికారులు

చిన్నగూడూరు: గ్రామాల్లో, తండాల్లో పారిశుద్ధ్యం లోపించి అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని మేఘ్యాతండా జీపీ పరిధిలోని చినతండా పరిసరాల్లో పరిశుభ్రత లోపించి ఆంజనేయ స్వామి ఆలయం ముందు, రోడ్లపై పెంట కుప్పలు వెలుస్తున్నాయి. రోడ్ల పైనే పెంట కుప్పలు, బహిరంగ మల మూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. పెంటకుప్పలు డంపింగ్ చేయడంతో దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలుపుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపం ప్రజలకు



రోడ్డుపై పెంటకుప్పలు

శాపంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కరువు

గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామ పంచాయతీల చొప్పున బాధ్యతలను అప్పగించింది. ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నా కొంతమంది అధికారులు నేటికీ గ్రామాలను, తండాలను సందర్శించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేకాధికారుల పాలనలో పట్టించుకునే నాథుడే లేకపోవడంతో పల్లెల్లో, తండాల్లో పారిశుద్ధ్యం ఎక్కడికక్కడ పేరుకుపోయింది. రోడ్లపై పెంటకుప్పలు దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా తండా రోడ్లపై బహిరంగ మలమూత్ర విసర్జన చేయడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై చెత్తాచెదారం, పెంట కుప్పలు తొలగించి, బహిరంగ మలమూత్ర విసర్జన చేయకుండా తండావాసులకు అవగాహన కల్పించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: నీటిపారుదల శాఖ అధికారులపై ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ, నీటిపారుదల శాఖల అధికారులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులు, ప్రజలు నీరులేక పొలాలన్ని ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీటి సరఫరా సరిగా జరగడంలేదని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. రాబోయేది వేసవి కాలమని తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, రైతులకు ఎలాంటి సమస్యలు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్సారెస్పీ కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోవటం ద్వారా నీటి ప్రవాహంలో అవాంతరాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు

అర్హుల పేర్లు లేకుంటే ఉద్యోగాలు ఊడుతాయ్..

కేసముద్రం: ప్రభుత్వ పథకాలను అందించేందుకు తయారు చేసిన జాబితాలో అర్హుల పేర్లు లేకుంటే, సంబంధిత అధికారుల ఉద్యోగాలు ఊడిపోతాయని ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ హెచ్చరించారు. గురువారం మండలంలోని పెనుగొండ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు ఆయన హాజరై, మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయభరోసా, కొత్తరేషన్‌కార్డుల పంపిణీ ఈనెల 26 నుంచి ప్రారంభం అవుతుందన్నారు. దరఖాస్తులను పరిశీలించి, నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకన్న, కేసముద్రం, ధన్నసరి సొసైటీ వైస్ చైర్మన్‌లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, స్పెషల్ ఆఫీసర్ యాదగిరి, మార్కెట్ డైరెక్టర్ కాకి విజయ పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

గ్రామసభల పేరిట ప్రభుత్వ మోసం

తొర్రూరు: సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపడుతున్న గ్రామ సభలతో రాష్ట్ర ప్రభుత్వం మోసగిస్తోందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. డివిజన్ కేంద్రంలోని మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రవి మాట్లాడుతూ గ్రామ సభలు నామమాత్రంగా జరుగుతున్నాయని, లబ్ధిదారుల ఎంపిక చేపట్టకుండా అధికారులు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకే అందించాలని, లేని పక్షంలో ప్రజాగ్రహం తప్పదన్నారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, నాయకులు జక్కుల యాకన్న, శ్రీరాం పుల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

భూగర్భ జలాల నాణ్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

బయ్యారం: భూగర్భ జలాల నాణ్యతపై నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్(ఎన్‌హెచ్‌పీ)లో భాగంగా షేర్ సేవా సంస్థల ఆధ్వర్యంలో గురువారం మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలో ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలో పిజోమీటర్స్ లేని గ్రామాలను ఎంపిక చేసి అక్కడ సంచార ప్రయోగశాల వాహనం ద్వారా నీటి నాణ్యతను పరిశీలిస్తున్నట్లు జిల్లా భూగర్భ జల శాఖాధికారి వేముల సురేష్ తెలిపారు. పరీక్షించిన నీరు వ్యవసాయానికి ఉపయోగకరంగా ఉన్నాయా లేదా అనే అంశాలను రైతులకు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, అసిస్టెంట్ జియోఫిసిస్ట్ శ్రీనివాస్, అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్ట్ స్నేహ, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పనిచేయాలి

గార్ల: సంక్షేమ పథకాల మంజూరులో అధికార పార్టీ నాయకులకు తలొగ్గకుండా అధికారులు పారదర్శకంగా పనిచేయాలని సీపీఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. పథకాలు అధికార పార్టీకి చెందిన లబ్ధిదారులకే మంజూరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రజాపాలన ఇలాగే కొనసాగితే రానున్న పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు, పెద్దవెంకటేశ్వర్లు, అంబటి వీరస్వామి, నాగరాజు, ఉమ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యవతి

కళావేదిక పైకప్పు ప్రారంభం



కురవి: ప్రారంభిస్తున్న రమణగుప్త

కురవి/కేసముద్రం: అమెరికాలో ఉంటున్న బొడ్ల సత్యనారాయణశారద దంపతులు వారి తల్లిదండ్రులు బొడ్ల రంగనాయకులు–శాంతలక్ష్మి జ్ఞాపకార్థంగా మండ కేంద్రంలో జెడ్పీ హైస్కూల్ ఆవరణలో రూ.2.50లక్షల వ్యయంతో నిర్మించిన కళావేదిక పైకప్పును వారి తరపున ఈటీవీ రమణగుప్త–సంధ్య దంపతులు ప్రారంభించారు. అలాగే కేసముద్రం స్టేషన్ జెడ్పీ హైస్కూల్‌లో రూ.3.50లక్షలతో కళావేదికను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎండీ వాహిద్, రాజు బాలవికాస ప్రతినిధి తిరుపతి, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, ఉపాధ్యాయులు శ్రీధర్, వెంకటేశ్వర్లు, వెంకన్న, లక్ష్మయ్య, శ్యామలాదేవి, విజయ్‌రాజ్, నర్సింహాచారి పాల్గొన్నారు.

అభినందనీయం

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాల, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం వేదిక పైకప్పును డీఈఓ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. దాత ఎన్ఆర్ఐ బొడ్ల సత్యనారాయణ శారద గార్ల తల్లిదండ్రులు బొడ్ల శాంతలక్ష్మి రంగనాయకల జ్ఞాపకార్థం రూ. 2లక్షలతో పాఠశాలల వేదిక పైకప్పుకు అందించడం అభినందనీయమన్నారు.

మంచు కురిసే వేళలో..



కురవి వీరన్న సన్నిధిపై కమ్ముకున్న పొగమంచు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆలయంపై గురువారం పొగమంచు కమ్ముకుంది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8.30 గంటల వరకు పొగ మంచు కమ్ముకోవడంతో ఆలయానికి వచ్చిన భక్తులు చలిలోనే స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

డోర్నకల్: డోర్నకల్ పట్టణాన్ని గురువారం మంచు కమ్మేసింది. రైల్వే ట్రాక్ భద్రతను పర్యవేక్షించే ట్రాక్‌మెన్లు దట్టమైన మంచుతో రైల్వే ట్రాక్ పక్కన విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



డోర్నకల్‌లో మంచులో విధులు నిర్వహిస్తున్న రైల్వే ట్రాక్‌మెన్

ఆటోను ఢీకొట్టిన బైక్

ఇద్దరికి తీవ్రగాయాలు

మరిపెడ రూరల్: ప్రయాణికులతో వెళ్తున్న అప్పి ఆటోను వెనుకనుంచి పల్సర్ బైక్ ఢీకొట్టగా ఆటో పల్టీ కొట్టగా డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరి మహిళలకు తీవ్రగాయాలైన సంఘటన మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం స్టేజి వద్ద 365 రహదారిపై గురువారం చోటు చేసుకుంది. కథనం ప్రకారం.. మండలంలోని వీరారం గ్రామానికి చెందిన తల్లి కూతురు కొండెబోయిన పుల్లమ్మ, టింకం వెంకటమ్మ ఇదే గ్రామానికి చెందిన దాసరి అశోక్ అనే వ్యక్తి అప్పి ఆటో కిరాయి మాట్లాడుకొని మహబూబాబాద్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పురుషోత్తమాయగూడెం స్టేజి వద్ద ఆటోను వెనక నుంచి ఓ పల్సర్ బైక్ బలంగా ఢీకొట్టింది. ఆటో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈసంఘటనలో ఇద్దరు మహిళలకు పలుచోట్ల తీవ్ర గాయాలు కాగా, ఆటో డ్రైవర్ అశోక్‌కు రెండు చోట్ల కాలు విరిగింది. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

తవ్వుతున్నారు.. పూడుస్తున్నారు

నెహ్రూసెంటర్: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సుందరీకరణ పనుల్లో భాగంగా ఆస్పత్రి ఆవరణలో వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు కోసం పనులు ప్రారంభించారు. ఫౌంటేన్ పనులను, ఆస్పత్రి ఆవరణలో సీసీ పనులు కాంట్రాక్టర్లు వదిలివేయడంతో నెలల తరబడి పనులు జరగకుండా అలాగే ఉండిపోయాయి. ఫౌంటేన్ పనులు పూర్తి చేయకుండానే ఇటీవల మట్టిని మొత్తం నింపారు. దీంతో ఎందుకు తవ్వారో.. ఎందుకు పూడుస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు ఆశ్చర్యపోతున్నారు. సుందరీకరణ పనులు చేపట్టకుండా సదరు కాంట్రాక్టర్లు వదిలివేయడంతో ఏదైన ప్రమాదం జరుగుతుందోనని పూడుస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలియజేస్తున్నాయి. ఇప్పటికైన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఫౌంటేన్‌లో పోసిన మట్టి

కొనసాగుతున్న ప్రజాపాలన గ్రామసభలు

భూములు, ఆస్తులు కలిగి ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లు, కూలీలకు ఆత్మీయ భరోసా పథకాలు మంజూరు చేశారంటూ గ్రామసభలో అర్హులైన లబ్ధిదారులు అధికారులపై మండిపడ్డారు. గురువారం ప్రజాపాలన గ్రామసభలు కొనసాగాయి. అధికారులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు మంజూరు కాని వారు గ్రామసభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. - సాక్షి నెట్‌వర్క్



తొర్రూరు రూరల్: బోజ్యతండాలో అధికారులతో వాగ్వాదం చేస్తున్న తండావాసులు



మరిపెడ రూరల్: తాళ్లఊకల్‌లో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



కేసముద్రం: ఇనుగుర్తి గ్రామసభలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు



కురవి: సూర్యతండాలో అధికారిని నిలదీస్తున్న తండావాసి



గూడూరు: గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

సంక్షిప్త సమాచారం

ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా ప్రవీణ్

గూడూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మందుల ప్రవీణ్‌మాదిగను ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా నియమిస్తున్నట్లు సంఘం జాతీయ కార్యదర్శి, మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్యమాదిగ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

గూడూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆదివాసులకు అందాలంటే ముందుగా ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు దారం నరేష్ డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పెనుక వెంకటేష్, ఈసం యాకయ్య పాల్గొన్నారు.

రేపు వైద్యశిబిరం



గార్ల: బయ్యారంలో ఈనెల 25న ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల కోసం నిర్వహించే ఉచిత మెగా వైద్యశిబిరంను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల గార్ల–బయ్యారం మండలాల అధ్యక్షుడు గుడి రాంప్రసాద్ గురవారం కోరారు.

చెరువు శిఖం భూములకు రైతుభరోసా రద్దు చేయాలి

మరిపెడ రూరల్: మండలంలోని చిల్లంచర్ల చెరువుల శిఖంలో అక్రమంగా ఉన్న పట్టాలను రద్దు చేయడంతో పాటు రైతు భరోసా కూడా రద్దు చేయాలని అదే గ్రామానికి చెందిన పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు చిల్లంచర్ల గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.

మంత్రి పరామర్శ



మరిపెడ రూరల్: మండలంలోని బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంట్రాక్టర్ నల్లు శ్రీకాంత్‌రెడ్డికి మాతృమూర్తి నల్లు పద్మ (60) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, అండ్ పీఆర్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం పద్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి వెంట ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లా డీసీసీబీ చైర్మన్ తాళ్లూరి బ్రహ్మయ్య, నూకల అభినవ్‌రెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిన్నగూడూరు: డాబా పైనుంచి కింద పడి తీవ్ర గాయాలైన ఘటనలో మండల కేంద్రానికి చెందిన గాడిపెల్లి లక్ష్మీనారాయణ(39) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గార్ల: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ అధైర్య పడవద్దని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో శంషాద్‌బేగం, యాకూబ్‌పాషా, బాబులాల్, రామ్ కుమార్, సర్వేశ్‌నాయక్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో గురువారం రూ.11,32,500 విలువ చేసే సీఎం రిలీఫ్ చెక్కులను మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవి నాయక్, కిశోర్ వర్మ, శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన చెట్టు

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పక్కనున్న పెద్ద చెట్టు బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు ఒక్కసారిగా కూలి రోడ్డుపై పడింది. ఆ సమయంలో ఈ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. మధ్యాహ్నం చెట్టును తొలగించారు.

విజయవంతం చేయాలి

మహబూబాబాద్ రూరల్: ఈనెల 25న జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కట్లోజు పాండురంగాచారి, పార్టీ మండల కార్యదర్శి తండా సందీప్ అన్నారు. మండలంలోని అయోధ్య గ్రామంలో సీపీఐ గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, మురళీ పాల్గొన్నారు.

గార్ల: మానుకోటలో ఈనెల 25న నిర్వహించే సీపీఐ శతాబ్ది ఉత్సవ సభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు కట్టెబోయిన శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

కురవి: ఈనెల 25న జిల్లా కేంద్రంలో సీపీఐ శతాబ్ది ఉత్సవ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, మల్లమ్మ, నాగమణి, వెంకటమ్మ పాల్గొన్నారు.